క్లుప్తంగా

జాతర నిర్వహణకు కమిటీ



ఎంపికైన కమిటీ సభ్యులు

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని తంగళ్లపల్లిలో నిర్వహించనున్న ప్రతాపరుద్ర లక్ష్మీనరసింహస్వామి సింగరాయ జాతర నిర్వహణకు జాతర కమిటీని శుక్రవారం ఏర్పాటు చేశారు. 29న జరిగే జాతరకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చూసేందుకే ఈ కమిటీ నియమించినట్లు మాజీ సర్పంచ్ పాము శ్రీకాంత్ తెలిపారు.

కార్యదర్శిని నిలదీసిన పాలమాకుల గ్రామస్తులు



అనితను నిలదీస్తున్న గ్రామస్తులు

నంగునూరు(సిద్దిపేట): అధికారుల నిర్లక్ష్యం వల్ల కొత్త రేషన్‌కార్డుల సర్వేలో తమపేర్లు లేవని, తమకు న్యాయం చేయాలని శుక్రవారం పాల మాకుల గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శిని నిలదీశారు. వారు మాట్లాడుతూ కొత్త రేషన్‌కార్డుల కోసం ప్రజాపాలనలో అధికారులు దరఖాస్తులు స్వీకరించారన్నారు. వివరాలు అందజేసినా తమపేర్లు ఎందుకు లేవని ప్రశ్నించారు. ఉన్నతాధికారులకు నివేదిస్తామని పంచాయతీ కార్యదర్శి అనిత చెప్పారు. అనంత రం తమకు న్యాయం చేయాలని కోరుతూ నంగునూరులో తహసీల్దార్ సరిత, ఎంపీడీఓ లక్ష్మణప్పకు వినతిపత్రం అందజేశారు.

దిష్టిబొమ్మ దహనం



నిరసన తెలుపుతున్న నాయకులు

హుస్నాబాద్: దేశ స్వాతంత్య్రం కోసం పోరాడిన నాయకులు, ప్రజలను ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం బీఎస్పీ నేతలు ఆయన చిత్రపటాన్ని దహనం చేశారు. ఈ సందర్భంగా బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్ మాట్లాడుతూ జాతీయ జెండాను, నాయకులను అవ మానపరిచే విధంగా మోహన్ భగవత్ మాట్లాడటం సరికాదన్నారు. బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే మోహన్ భగవత్‌పై దేశద్రోహం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు వెంకటేశ్, శంకర్, సుధాకర్, రాజు తదితరులు ఉన్నారు.

విజేతలకు బహుమతులు



బహుమతి అందజేస్తున్న రామరాజు

గజ్వేల్‌రూరల్: శ్రీరామకోటి భక్తసమాజం ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు శుక్రవారం బహుమతులు అందజేశారు. సంక్రాంతి సందర్భంగా తాలుకా స్థాయిలో నిర్వహించిన ఈ పోటీలలో 455 మంది మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామకోటి రామరాజు మాట్లాడుతూ 25యేళ్లుగా ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో విశల్, ఉమేశ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి వితరణ



సామగ్రిని అందజేస్తున్న మిత్ర మండలి సభ్యులు

హుస్నాబాద్: మిత్ర మండలి -87 బృందం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు శుక్రవారం పరీక్ష సామగ్రి వితరణ చేశారు. బాలికలు, బాలుర పాఠశాలలకు చెందిన 110 మంది విద్యార్థులకు ప్యాడ్స్, పెన్నులు, పెన్సిళ్లు, రబ్బర్లు ఇతర సామగ్రిని అందజేశారు. తాము చదువుకున్న పాఠశాలలకు సేవ చేయాలనే సంకల్పంతోనే వాటిని అందించినట్లు తెలిపారు. విద్యార్థులు పది జీపీఏ సాధించేలా ఉపాధ్యాయులు తగిన శిక్షణ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాలల హెచ్ఎంలు వాసుదేవరెడ్డి, వెంకటయ్య, మిత్ర మండలి అధ్యక్షుడు బూట్ల రాజమల్లయ్య, సభ్యులు అనిత శ్రీనివాస్‌రెడ్డి, దొడ్డి శ్రీనివాస్, గౌరిశెట్టి రాజు, శ్రీనివాస్ గౌడ్ తదితరులు ఉన్నారు.

నిధులు రాక.. నిర్వహణ లేక

తలుపులు, కిటికీలు చెక్కు చెదురుతున్నాయి. తాగునీటి సౌకర్యం లేదు. అధ్వానంగా ఉన్న మరుగుదొడ్లు. నాణ్యతలేక దెబ్బతింటున్న వరండాలు. నిర్వహణ కరువు వెరసి రైతు వేదికలు దీనస్థితిలో పడ్డాయి. అంతటికీ కారణం ఎన్నోయేళ్లుగా నిధులు రాకపోవడం. దీంతో వ్యవసాయ అధికారులకు భారంగా మారింది.

- ఇబ్బందులు పడుతున్న వ్యవసాయ అధికారులు
- కనీస వసతులు కరువు, రైతు వేదికల దుస్థితి
- పట్టించుకోని ఉన్నాధికారులు



తిగుల్‌లో రైతు వేదిక భవనం



నీటి వసతిలేక నిరుపయోగంగా..



విరిగిన తలుపులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలాల వారీగా ఐదువేల ఎకరాలకు ఒక క్లస్టర్‌గా ఏర్పాటుచేసి ప్రభుత్వం రైతు వేదికలను నిర్మించింది. వ్యవసాయ అధికారులు గ్రామస్థాయిలో రైతులకు అందుబాటులో ఉండేందుకు, సమావేశాలు నిర్వహించుకునేందుకు రూ.22లక్షలతో ఈ వేదికలను నిర్మించారు. జిల్లాలో 127 రైతు వేదికలకు రూ.27.94 కోట్ల నిధులు ఖర్చుచేశారు. రైతుల సమావేశాలకు హాల్, రెండు మరుగుదొడ్లు, అధికారుల కోసం గది నిర్మించారు. దీంతో అధికారులు వ్యవసాయ సమావేశాలను రైతు వేదికల్లోనే నిర్వహిస్తున్నారు. అలాగే ప్రతి రోజు ఏఈఓలు కూడా ఇక్కడి నుంచే విధులు నిర్వహిస్తున్నారు.

నీటి సౌకర్యం లేక ఇబ్బందులు

జిల్లాలోని నిర్మించిన 127 రైతు వేదికల్లో చాలా చోట్ల నీటి వసతి లేదు. దీంతో మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగాలేదు. సమావేశాలకు వచ్చే ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

భద్రత కరువు

ముఖ్యంగా మహిళా ఏఈఓలకు మరిన్ని ఇబ్బందులు తప్పడం లేదు. అలాగే భవనాలకు ప్రహరీలు లేకపోవడంతో భద్రత కరువైంది. దీంతో వేదికల ఆవరణల్లో పశువులు, కుక్కల సంచరిస్తున్నాయి. అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాలుగా మారాయి.

28 నెలలుగా..

ప్రభుత్వం ప్రతి రైతువేదికల్లో కుర్చీలు, టేబుళ్లతో పాటు సమావేశాల కోసం మైక్‌సెట్ వంటి సామగ్రిని అందించింది. ప్రభుత్వం వాటి నిర్వహణ ఖర్చు నిమిత్తం నెలకు రూ.9వేలు ఇస్తామని ప్రకటించింది. 2022 ఆగస్టు నుంచి నిధులు రాకపోవడంతో ఏఈఓలు నిర్వహణ ఖర్చులు భరించలేక కొన్ని చోట్ల నిర్వహణ గాలికి వదిలేశారు.

నిర్వహణ నిధులు ఇలా..

పరిశుభ్రతకు	రూ.3000
శిక్షణ ఖర్చులకు	రూ.2500
స్టేషనరీ, జిరాక్స్‌కు	రూ.1000
విద్యుత్ చార్జీలకు	రూ.1000
మరమ్మతులకు	రూ.1000
తాగునీటికి	రూ.500

బ్యాంక్‌లలో సీసీ కెమెరాలు అవసరం

ఏసీపీ సతీశ్



మాట్లాడుతున్న ఏసీపీ సతీశ్

హుస్నాబాద్: బ్యాంక్‌లు వాటి పరిసర ప్రాంతాల్లో తప్పని సరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఏసీపీ సతీశ్ సూచించారు. సర్కిల్ పరిధిలో ఉన్న బ్యాంక్ మేనేజర్లతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. బ్యాంక్‌లు, ఏటీఎంల భద్రత, సీసీ కెమెరాల పనితీరుపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సెక్యూరిటీ గార్డ్స్‌లేని బ్యాంక్‌లలో సెక్యూరిటీని ఏర్పాటు చేసుకోవాలన్నారు. కేసుల పరిశోధనలో బ్యాంక్ అధికారులు సహకరించాలని సూచించారు. మెయిన్ బ్రాంచ్ నుంచి ఇతర బ్రాంచ్‌లకు డబ్బులు తీసుకొని వెళ్లేటప్పుడు భద్రతా చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో సీఐ శ్రీనివాస్, ఎస్ఐ మహేశ్, వివిధ బ్యాంక్‌ల మేనేజర్లు పాల్గొన్నారు.

అర్హుల ఎంపిక అందరి బాధ్యత

జెడ్పీ సీఈఓ రమేశ్



జగదేవ్‌పూర్‌లో రికార్డులను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ రమేశ్

జగదేవ్‌పూర్(గజ్వేల్): గ్రామసభలు నిర్వహించి అసలైన అర్హులను ఎంపిక చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని జెడ్పీ సీఈఓ రమేశ్ అన్నారు. జగదేవ్‌పూర్ మండల కార్యాలయంలో శుక్రవారం ఆయన రికార్డులను పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 21 నుంచి 24 వరకు జరిగే గ్రామ సభలను విజయవంతం చేయాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలకు లబ్ధిదారుల ఎంపికపై నివేదిక తయారు చేయాలని, అలాగే గ్రామాల్లో ఈజీఎస్ పనులను వేగవంతం చేసి కూలీల సంఖ్య పెంచాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ యాదగిరి, అధికారులు శైలజ, ఆంజనేయులు పాల్గొన్నారు.

భాగస్వాములను చేయాలి

హుస్నాబాద్: ఇందిరమ్మ కమిటీ సభ్యులు, వార్డు అధికారులు ఈ నెలలో నిర్వహించనున్న వార్డు సభల్లో ప్రజలను భాగస్వాములను చేయాలని మున్సిపల్ చైర్ పర్సన్ రజిత అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఇందిరమ్మ కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల అర్హులైన పేదలందరికీ మంజూరు చేయడానికి కృషి చేయాలని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, వైస్ చైర్‌పర్సన్ అనిత, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

• శుభ్రం చేయించారు..





రైతుబజార్, శివాజీనగర్‌లో మురుగుకాలవలను శుభ్రంచేస్తున్న సిబ్బంది

జిల్లా కేంద్రంలోని ప్రధాన మురుగు కాలువలను అధికారులు శుభ్రం చేయించారు. పట్టణంలోని చాలాచోట్ల డ్రైనేజీలు చెత్తాచెదారాలతో నిండిపోయాయి. దీంతో ఎక్కడికక్కడ మురుగు నిలచి దుర్గంధం వెదజల్లుతోంది. శుక్రవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన ‹కంపుకొడుతున్నాయి అనే ఫొటో కథనానికి స్పందించిన మున్సిపల్ అధికారులు స్పందించారు. శుక్రవారం సిబ్బందితో శుభ్రం చేయించారు.

– సాక్షి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, సిద్దిపేట

ఆరోపణలపై విచారణ



విచారణ జరుపుతున్న డీపీఎం విద్యాసాగర్

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని లింగాపూర్‌లోని ఉజ్వల గ్రామైక్య సంఘంలో హమాలీ కార్మికుల డబ్బులను నిబంధనలకు విరుద్ధంగా ఖర్చు చేశారని గ్రామానికి చెందిన మహేందర్ ఐకేపీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో డీపీఎం విద్యాసాగర్ శుక్రవారం గ్రామపంచాయతీ ఆవరణంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2012లో హమాలీ కార్మికుల కోసం ప్రభుత్వం చెల్లించిన డబ్బులతో గ్రామంలో ధాన్యంకొనుగోలు కేంద్రం కోసం స్థలం కొనుగోలు చేశారని, మార్కెట్ అవసరాల కోసం తీర్మానాలు లేకుండా డబ్బులు డ్రా చేసినట్లు ప్రాథమికంగా అంచనాకు వచ్చినట్లు చెప్పారు. 22న మరోసారి పూర్తిస్థాయిలో విచారిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు, ఐకేపీ సీసీలు పాల్గొన్నారు.

నేడు మల్లన్నసాగర్ నీటి విడుదల

తొగుట(దుబ్బాక): రాష్ట్ర దేవాదాయ, అటవీశాఖల మంత్రి కొండా సరేఖ కొమురవెల్లి మల్లన్నసాగర్ రిజర్వాయర్ నుంచి శనివారం సాగునీటిని విడుదల చేస్తారని డీఈ చెన్ను శ్రీనివాస్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యాసంగి పంటలను కాపాడేందుకు చెరువులు, చెక్‌డ్యాంలు నింపడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం 2.45 ని.లకు సిద్దిపేట, దుబ్బాక నియోజకవర్గాలకు సాగునీటిని మంత్రి విడుదలచేస్తారని ఆయన పేర్కొన్నారు.

మోడల్ భవన నిర్మాణానికి ..

నంగునూరు(సిద్దిపేట): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో భాగంగా నంగునూరులో నిర్మించనున్న మోడల్ భవనానికి శనివారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ శంకుస్థాపన చేస్తారని ఎంపీడీఓ లక్ష్మణప్ప తెలిపారు. మధ్యాహ్నం 5గంటలకు జరిగే కార్యక్రమానికి సంబంధిత అధికారులు హాజరుకావాలని చెప్పారు.

నేటి సంవిధాన్ బచావో పాదయాత్ర: కొమ్మూరి



మాట్లాడుతున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం తలపెట్టిన సంవిధాన్ బచావో పాదయాత్రలో ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చే యాలని మాజీ ఎమ్మెల్యే, జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆయన మాట్లాడారు. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75వసంతాలు పూర్తవుతున్న సందర్భంగా దేశ వ్యాప్తంగా చేపడుతున్న ఈ కార్యక్రమం గాంధీచౌరస్తా నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు కొనసాగుతుందన్నారు. మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వి.హనుమంతరావు పాల్గొని ప్రసంగిస్తారని చెప్పారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని పలు గ్రామాలలో మృతి చెందిన, అనారోగ్యంతో బాధపడుతున్న బాధితుల కుటుంబాలను శుక్రవారం మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పరామర్శించారు. బేగంపేటలో ఇటీవల అనారోగ్యానికి గురైన మామిడి లక్ష్మణ్, కొరివి తిరుపతిని, అలాగే గుండారంలో మృతి చెందిన పరకాల లక్ష్మీనర్సయ్య, గైని వజ్రవ్వల కుటుంబాలను ఆయన పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్ రెడ్డి, లింగాల లక్ష్మణ్, కనగండ్ల తిరుపతి, రాజయ్య, సంజీవరెడ్డి, తిరుపతిరెడ్డి, శేఖర్‌బాబు, మోహన్, రామలింగారెడ్డి, అంజయ్య, రాములు, నరేశ్, సుదర్శన్ తదతరులు పాల్గొన్నారు.

స్వయంశక్తితోనే ఆర్థికాభివృద్ధి

మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి



మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

బెజ్జంకి(సిద్దిపేట): మహిళలు స్వయం శక్తితో ఆర్థికంగా ఎదగాలని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను శుక్రవారం ప్రారంభించారు. అనంతరం బెజ్జంకి, చిలాపూర్, చిలాపూర్‌పల్లె, గుండారం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అనంతరం కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అధ్యక్షుడు దామోదర్, రత్నాకర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ కృష్ణ, వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, పోచయ్య, శ్రీనివాస్‌రెడ్డి, రాములు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఆయన లక్ష్మీ నర్సింహస్వామి ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధికి పాటుపడతానని చెప్పారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): లారీ డ్రైవర్‌లు, యజమానులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పోలీసు అధికారులు



వర్గల్ గురుకులంలో ఎన్‌సీసీ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ మురళి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/వర్గల్(గజ్వేల్)/తొగుట(దుబ్బాక): జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా పోలీసులు నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలు శుక్రవారం కూడా కొనసాగాయి. మద్యం తాగి వాహనాలు నడపవద్దని పలువురు పోలీసు అధికారులు సూచించారు. సిద్దిపేట లారీ ఓనర్స్, డ్రైవర్స్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్, ఎంవీఐ శంకర్‌నారాయణ మాట్లాడారు. ప్రతి వాహనదారుడు తన కుటుంబాన్ని గుర్తు చేసుకుంటూ నడపాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ గోపాల్ రెడ్డి, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ నేహ తదితరులు పాల్గొన్నారు. వర్గల్ పూలే గురుకుల బాలికల డిగ్రీకళాశాలలో ఎన్‌సీసీ క్యాంపు విద్యార్థులకు గజ్వేల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మురళి రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడిపితే మైనర్‌తోపాటు వాహన యజమానిపై కేసు నమోదవుతుందన్నారు. కార్యక్రమంలో గజ్వేల్ అగ్నిమాపక కేంద్ర అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఎన్‌సీసీ కల్నల్ ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు. తొగుటలో జరిగిన కార్యక్రమాంలో ఎస్ఐ రవికాంత్‌రావు మాట్లాడారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు.

పారదర్శకంగా సర్వే నిర్వహించాలి

అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్



మద్దూరు(హుస్నాబాద్): సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

మద్దూరు(హుస్నాబాద్): సంక్షేమ పథకాల అమలుకు నిజమైన అర్హులను గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ ఆదేశించారు. దూల్మిట్ట మండలంలోని జాలపల్లిలో జరుగుతున్న సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులతో మాట్లాడారు. ఏయే పథకాల కోసం దరఖాస్తు చేసుకొన్నారోనని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులకే పథకాలు అందేలా అధికారులు సర్వే చేయాలన్నారు. పేదలను గుర్తించాలని, భూములు, ఆదాయం వంటి వివరాల నమోదులో తప్పులు లేకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మధుసూదన్, ఆర్ఐ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

సర్వే పరిశీలన

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/సిద్దిపేటఅర్బన్ /అక్కన్నపేట(హుస్నాబాద్)/హుస్నాబాద్‌రూరల్: ప్రభుత్వ పథకాలకు అర్హులను గుర్తించేందుకు జరుగుతున్న సర్వే ప్రక్రియను అధికారులు శుక్రవారం పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని పలు వార్డులలో చేపట్టిన సర్వేను మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ పరిశీలించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్‌లు రియాజొద్దీన్, నాయిని చంద్రం, సాకి బాల్‌లక్ష్మి ఆనంద్, అధికారులు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాలలో రెండోరోజు కొనసాగిన సర్వేను ఏడీఏ పద్మ పరిశీలించారు. రేషన్‌కార్డు దారులు, నిరుపయోగంగా ఉన్న భూముల వివరాలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ లబ్ధిదారులకు న్యాయం జరిగేలా పారదర్శకంగా సర్వే ర్వహిస్తున్నామన్నారు. తహసీల్దార్ సలీమ్, ఏఓ శ్రీనాథ్, ఆర్ఐ సంజీవ్, పంచాయతీ కార్యదర్శి గీత, స్థానిక నాయకులు పాల్గొన్నారు. అక్కన్నపేటలో నిర్వహించిన రైతు భరోసా సర్వేను ఎంపీడీఓ భానోతు జయరాం పరిశీలించారు. సర్వే నిర్వహణ తీరును ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నామన్నారు. మండలంలో సాగుచేయని, సాగుకు యోగ్యంకాని భూములకు రైతుభరోసా వర్తించదని చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్ఓ చామంతి, ఏఈఓ విజయ్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంతరావు తదితరులు పాల్గొన్నారు. హుస్నాబాద్‌రూరల్ మండలం నాగారం, పోతారం(ఎస్) గ్రామాల్లో భూముల సర్వేను ఆర్డీఓ రామ్మూర్తి పరిశీలించారు. ప్రతి రైతుకు రైతు భరోసా అందే విధంగా భూముల వివరాలను నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఏఓ నాగరాజు ఉన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి

సీపీఎం నాయకుల పిలుపు

కొమురవెల్లి(సిద్దిపేట)/దుబ్బాకటౌన్/మిరుదొడ్డి(దుబ్బాక)/బెజ్జంకి(సిద్దిపేట): మూడు రోజుల పాటు సంగారెడ్డిలో నిర్వహించనున్న సీపీఎం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ నేతలు శుక్రవారం పిలుపునిచ్చారు. సభల విజయవంతానానికి శుభసూచికగా పలు చోట్ల పార్టీ జెండాలను ఆవిష్కరించారు. కొమురవెల్లిలో జిల్లా కార్యవర్గ సభ్యుడు శెట్టిపల్లి సత్తిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడేందుకే రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నామన్నారు. పార్టీ సభ్యులు, కార్మికులు, వ్యవసాయకూలీలు, సంఘటిత, అసంఘటిత కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్, శారద, ప్రశాంత్, బాలకిషన్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా దుబ్బాకలోని పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు భాస్కర్ మాట్లాడారు. మహాసభలకు పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు బృందాకరత్, బీవీ రాఘవులు హాజరవుతారని చెప్పారు. నవీన, భాస్కర్, సాజిద్, లక్ష్మీనరసయ్య తదితరులు పాల్గొన్నారు. మిరుదొడ్డి మండల కేంద్రంలో మండల కన్వీనర్ మద్దెల అంజయ్య, అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో మండల సెక్రెటరీ లింగంపేట ఎల్లయ్య, రుద్రారంలో పార్టీ సభ్యుడు క్రాంతి పార్టీ జెండాలను ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాలల్లో విజయ్, శ్రీనివాస్, మల్లయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు. బెజ్జంకిలో జరిగిన కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్ మాట్లాడారు. అగ్రనాయకులు పాల్గొనే ఈ సభలకు అధికసంఖ్యలో కార్మికులు, విద్యార్థులు తరలిరావాలని కోరారు. సంగ ఎల్లయ్య, బొనగిరి లింగం, కుంట సత్తయ్య, తిరుపతి, ప్రభాకర్, శ్రీనివాస్, మహేశ్ పాల్గొన్నారు.

మున్సిపల్ పన్ను పేరుతో సైబర్ మోసం

చేర్యాల(సిద్దిపేట): పట్టణ పరిధిలోని ఓ వ్యాపారి మున్సిపల్ పన్ను కట్టాలంటూ వచ్చిన లింక్ ఓపెన్ చేసి రూ.9,990లు పోగొట్టుకున్న ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఓ వ్యాపారికి గుర్తు తెలియని ఫోన్ నంబర్ నుంచి మున్సిపల్ పన్ను చెల్లించాలని మెసేజ్ వచ్చింది. ఆన్‌లైన్‌లో కట్టవచ్చనే ఉద్దేశ్యంతో ఆ వ్యాపారి లింక్ ఓపెన్‌చేసి నగదును చెల్లించాడు. విషయం చెప్పేందుకు ఫోన్‌చేయగా స్విచ్‌ఆఫ్ వచ్చింది. దీంతో మోసపోయానని గమనించి స్థానిక పోలీసులను ఆశ్రయించగా 1930కి ఫిర్యాదు చేయాలని సూచించినట్టు సమాచారం.